క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంచల్‌గూడ: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్‌లోని గడ్డియన్నారం, తిరుమల హిల్స్, సాయిబాబా టెంపుల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు గడ్డిఅన్నారం ఫీడర్ పరిధిలోని ఏపీఏయూ కాలనీ, గడ్డిఅన్నారం, వెంకటేశ్వర కామర్స్ కాలేజీ, తిరుమల హిల్స్, ఇండస్ బ్యాంక్, వాణిజ్య విహార్, నలంద కాలేజీ, బిగ్ సీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తిరుమలహిల్స్ ఫీడర్ పరిధిలోని తిరుమల హిల్స్, దిల్‌సుఖ్‌నగర్ రోడ్, చందన బ్రో, పోచమ్మ బస్తీ, కమలా ఆస్పత్రి, నారాయణ కాలేజీ, ఏస్ అకాడమీ, హెరిటేజ్, సిద్దార్థ ఉమెన్స్ కాలేజీ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు సాయిబాబా టెంపుల్ ఫీడర్ పరిధిలోని సవేరా టిఫిన్స్, బొమ్మన బ్రదర్స్, జేసీ బ్రదర్స్, దిల్‌సుఖ్‌నగర్ ఆంధ్రా బ్యాంక్, రాజీవ్ చౌక్, చాయ్‌ఘర్, శిల్పిబార్, సాయిబాబా టెంపుల్, దిల్‌సుఖ్‌నగర్ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు వివరించారు.

సన్మానం



విజయభాస్కర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

చాదర్‌ఘాట్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని భారత జాగృతి బుధవారం సాయంత్రం తెలంగాణ సాహిత్య సభల్లో భాగంగా తెలంగాణ సారస్వత పరిషత్తులో మలక్‌పేటకు చెందిన డాక్టర్ ఎస్. విజయభాస్కర్‌కు మెమెంటో, శాలువతో సన్మానం చేశారు. విజయ్‌భాస్కర్ కవిగా, రచయితగా, ఉపాధ్యాయులుగా, పాఠ్య పుస్తకాల రచయితగా, ప్రతిక సంపాదికుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రముఖ సాహితీ వేత్త సంగనభట్ల నర్సయ్య తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిలో రూ. 43, వంకాయ 28, బెండ 35, పచ్చిమిర్చి 60, కాకర 45, బీర 35, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 13, క్యారెట్ 45. దొండ 28, ఆలు 21, ఉల్లి 17, గోకర 40, దోస 15, సొర 15, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 85, అర్వి 35, మునగ 35, చిలగడదుంప 45, బీట్‌రూట్ 25, కీర 28, ఫ్రెంచ్ బీన్స్ 95, క్యాప్సికమ్ 45 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఉద్యమకారులకు ప్రత్యేక స్థానం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: తెలంగాణ రాష్ట్ర సాధనలో అసువులు బాసిన వారికి, ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న త్యాగధనులకు ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుందని, రాబోయే రోజుల్లో వారికి మరిన్ని పదవులు వచ్చేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధిలోని పీఎంఆర్ ఫంక్షన్ హాల్ గురువారం ఉద్యమకారుడు కుంట్లూరు వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... ఎంతోమంది బలిదానం వల్ల తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. ఉద్యమ సమయంలో శ్రీకాంతాచారి పాత్ర ఎంతో కీలకం అని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను ఘనంగా సన్మానించారు.

ఉత్సవాలు కాదు.. 'దశాబ్ది దగా'!



దిల్‌సుఖ్‌నగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఉత్సవాలు చేసుకునే నైతిక అర్హత బీఆర్‌ఎస్‌కు లేదన్న కాంగ్రెస్

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు
- పలు ప్రాంతాల్లో పెల్లుబికిన నిరసనలు
- అడ్డుకున్న పోలీసులు.. 31 మంది అరెస్ట్

చైతన్యపురి: బీఆర్‌ఎస్ పాలకులు దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమాలను ప్రచారం చేసుకుంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి విమర్శించారు. పీసీసీ పిలుపు మేరకు ప్రభుత్వ వైఫల్యాలపై దశాబ్ది దగా పేరుతో గురువారం కాంగ్రెస్ పార్టీ చైతన్యపురిలోని నియోజకవర్గ కార్యాలయం నుంచి దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్ చౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా సరూర్‌నగర్ పోలీసులు అడ్డుకున్నారు. ధర్నా చేస్తున్న నాయకులను అరెస్ట్ చేసి చైతన్యపురి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు కాకున్నా ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేశారన్నారు.

- అమరవీరుల ఆశయాలను తుంగలో తొక్కారన్నారు. అమరుల త్యాగాలను, వారి కుటుంబాలను మరిచిందని, ఏ పథకానికీ అమరవీరుల పేరు పెట్టలేదని విమర్శించారు. తెలంగాణ ద్రోహులందరితో దశాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్న బీఆర్‌ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు.
- ఎల్‌బీనగర్‌లో శ్రీకాంతాచారి పెట్రోల్ పోసుకుని ఆత్మబలిదానం చేసుకున్న స్థలాన్ని కూడా ఇంతరవకు ముఖ్యమంత్రి ఏనాడూ సందర్శించలేదని విమర్శించారు.
- దశాబ్ది ఉత్సవాలు చేసుకున నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకారులకు తగిన విధంగా గురించి న్యాయం చేస్తామన్నారు.
- తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మోసాలను ప్రజలు గమనిస్తున్నారని మల్‌రెడ్డి స్పష్టం చేశారు.
- రాజీవ్ చౌక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డితో పాటు డివిజన్ అధ్యక్షులు, నాయకులు మొత్తం 21 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కొత్తపేట చౌరస్తాలో ఆందోళన చేస్తున్న పది మంది పార్టీ మహేశ్వరం నియోజకవర్గం నాయకులను అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలేసినట్లు పోలీసులు తెలిపారు.
- నాయకులు శశిధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, కిషోర్‌గౌడ్, వేణుయాదవ్, నర్సింహయాదవ్, మంజులారెడ్డి, వెంకటేశ్‌యాదవ్, స్వర్ణ మాధవి, రమేష్‌నాయక్, రాజశేఖర్, మక్సూద్ అలీ, జైపాల్‌రెడ్డి, మతిన్, సౌమ్యారెడ్డి, భాను, కవిత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



శారదానగర్ కాలనీలో పర్యటిస్తున్న ప్రేమేందర్‌రెడ్డి తదితరులు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

వనస్థలిపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్తా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన హయత్‌నగర్ డివిజన్ శారదానగర్, సుభద్రానగర్ కాలనీలలో గడప గడపకూ తిరుగుతూ 9 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, పథకాలను కాలనీవాసులకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చేలా పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, కేంద్ర సెన్సార్ బోర్డ్ సభ్యులు డాక్టర్ అప్పారావు, నాయకులు గోవిందాచారి, ఎర్రవెల్లి సత్యనారాయణ, మధుసూదన్‌రెడ్డి, ఎస్.సురేష్‌కుమార్, లక్ష్మణ్, అర్జున్, శాంతకుమార్, యాదగిరిరావు, సత్యారెడ్డి, వెంకన్న, విష్ణు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనం వృథా



జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని ముందస్తుగా హౌస్ అరెస్టు చేసిన ఎల్‌బీనగర్ పోలీసులు

మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నదని టీపీసీసీ డెలిగేట్, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. టీపీసీసీ ఆదేశాల మేరకు ఎల్‌బీనగర్‌లోని శ్రీకాంతాచారి విగ్రహం వద్ద దశాబ్ది దగా రావణ వధ కార్యక్రమాన్ని నిర్వహించాలనే పిలుపుమేరకు ఎల్‌బీనగర్ పోలీసులు తెల్లవారుజామున కాంగ్రెస్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జేపీఆర్ తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వ పనితీరును, ఎమ్మెల్యేల అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులకు పాల్పడటం సరికాదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు బుడ్డా సత్యనారాయణ, పెంటయ్య, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం



యోగా గురువు ఇస్మాయిల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: భారతీయ ఆధ్యాత్మిక యోగా విద్యతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రముఖ యోగా గురువు యోగిరత్న ఇస్మాయిల్ గురుజీ అన్నారు. కొత్తపేట బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఇస్మాయిల్ గురుజీ, లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ గురుజీ మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో మానసిక ఒత్తిడిలకు లోనవుతూ చిన్న వయసులోనే యువత సైతం అనారోగ్య సమస్యలతో సతమతం అవుతోందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సూర్య నమస్కారాలు, ఆసనాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సప్త ఋషి యోగా విద్యా కేంద్రం సప్త ఋషి టీవీ చానల్ వ్యవస్థాపకులు పూజ బీరెల్లి చంద్రారెడ్డి గురుజీ, లోటస్ ల్యాబ్ పబ్లిక్ స్కూల్ సెంట్రల్ హెడ్ జి.లలితారెడ్డి, తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు టేకుల మంజులారెడ్డి, జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ శ్రీ భావన శ్రీనివాస్ కర్మన్‌ఘాట్ బ్రాంచ్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఆమనగల్లు యోగా గురువు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ గురుజీని ఘనంగా సన్మానించారు.

కేంద్ర పథకాలతో పేదల సంక్షేమం

చంచల్‌గూడ: ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలు బడుగు బలహీన వర్గాల వారికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కుర్మగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ కె.సహదేవ్‌యాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలో ×సంపర్క్ అభియాన్‌÷లో భాగంగా ఇంటింటికీ బీజేపీ అనే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సహదేవ్‌యాదవ్ మాట్లాడుతూ... 60 సంవత్సరాలుగా లేని అభివృద్ధి గత 9 సంవత్సరాల్లో సాధించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకంలో కేంద్రం వాటా ఉందన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న కేంద్ర పథకాలకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్‌రెడ్డి, నాయకులు తంగెళ్ల సుధీర్, నిరంజన్‌యాదవ్, శ్రీనాథ్, నాగరాజు, శ్రీకాంత్, మోహన్ కృష్ణ, ప్రదీప్, ప్రవీణ్, శశికాంత్, లలిత తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో చివరి రోజైన గురువారం సాయంత్రం అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం నుంచి సెక్రటేరియట్ వరకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలను సంక్షేమం గురించి ప్రజలకు వివరించామని తెలిపారు. ఎల్‌బీనగర్‌లో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించామని చెప్పారు. చెరువుల సుందరీకణతోపాటు పార్కు లు, కాలనీలో మౌలిక వసతులను కల్పించామన్నారు. బైక్ ర్యాలీలో యువకులు ఉత్సవంగా పాల్గొన్నారని పేర్కొన్నారు.

అమరుల ఆకాంక్షలకు విరుద్ధంగా కేసీఆర్ పాలన



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయికులు

టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ అమరవీరుల ఆకాంక్షలకు విరుద్ధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో కేసీఆర్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం మహేశ్వరంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేయిస్తారా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ ప్రమాదంలో గాయపడ్డ కార్మికులకు కార్పొరేటర్ల పరామర్శ



నాగోలు: ఎల్‌బీ నగర్ సాగర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ కూలిపోయిన ఘటనలో గాయపడిన కార్మికులను కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఇతర కార్పొరేటర్లతో కలిసి గురువారం కిమ్స్ ఆస్పత్రిలో పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో చంపాపేట, గడ్డి అన్నారం కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధికార ప్రతినిధిగా యోగేశ్వరరెడ్డి



హస్తినాపురం: టీపీసీసీ అధికార ప్రతినిధిగా హస్తినాపురానికి చెందిన వెదిరె యోగేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా యోగేశ్వరరెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని... వచ్చే ఎన్నికలలో పార్టీ అధికారంలోకి వచ్చేలా పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పని చేస్తానని అన్నారు.

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం

- టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్



సీఎం దిష్టిబొమ్మతో వెళ్తున్న శ్రీనివాస్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

మలక్‌పేట: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి, మలక్‌పేట ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం ఆయన మలక్‌పేటలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఎం దిష్టిబొమ్మ దహనం చేయడానికి కార్యకర్తలతో ఇంటి నుంచి బయలుదేరిన శ్రీనివాస్‌ను మలక్‌పేట పోలీసులు కాలనీ పార్కు వద్ద అడ్డుకుని దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకున్నారు. కార్యకర్తలతో కలిసి కలిసి విజయవాడ రహదారిపై నిరసన తెలియజేశారు. అనంతరం సైదాబాద్ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల జరుపుకుంటున్న ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి దగా చేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపుకుంటున్న బీఆర్‌ఎస్‌కు గోరి కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యాదిలాల్, మహేష్, భాస్కర్, నాగరాజు, సాయిరామ్, శివ, భాస్కర్‌నాయక్, మనీష్, నితేష్, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మూసారంబాగ్‌లో ఇంటింటికీ బీజేపీ



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మూసారంబాగ్‌లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రకాశ్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డితో కలిసి కరపత్రాలు పంచిపెడుతూ మోదీ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి బీజేపీకి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. దేశం ఇంకా ప్రగతి సాధించాలంటే కేవలం మోదీతోనే సాధ్యమన్నారు. నాయకులు రమేష్‌రెడ్డి, లక్ష్మణ్, కొప్పుల దినేష్, సురేందర్, మోహన్, వరప్రసాద్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది డబుల్ ఇంజిన్ సర్కారే

బడంగ్‌పేట్: రాబోయే ఎన్నికల్లో తెలంగాణను డబుల్ ఇంజిన్ సర్కారు ఏలబోతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. గురువారం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి, గడపగడపకు వెళ్లి తొమ్మిదేళ్ల మోదీ పాలనలో చేపట్టిన ప్రజా సంక్షేమంపై కరపత్రాలు పంచుతూ వివరించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి, దేశాభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. 60 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ చేయలేని అభివృద్ధిని ప్రధాని మోదీ తొమ్మిదేళ్లలో సాధించారని అన్నారు. అందుకే రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలన్నారు. అప్పుడే తెలంగాణ ప్రజలకు కేసీఆర్ నుంచి విముక్తి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, శేఖర్‌రెడ్డి, రవికుమార్, మహేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, చారి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు

- కొత్తపేట చౌరస్తాలో ఏరులై పారుతున్న మురుగునీరు
- పట్టించుకోని అధికారులు



సరూర్‌నగర్ శ్రీత్రివేణి స్కూలు ముందు ప్రవహిస్తున్న మురుగు

హుడాకాంప్లెక్స్: ఒక వైపు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు.. మరో వైపు స్వచ్ఛ భారత్, స్వచ్ఛ హైదరాబాద్ అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో అధికారులు తమ నిర్లక్ష్యం వల్ల స్వచ్ఛతకు తూట్లు పొడుస్తున్నారు. వ్యర్థాలు, మురుగు పారుతుండడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా కాలనీ వాసులు, వాహనదారులు, పాదచారులు వ్యాధుల బారిన పడుతున్నారు. సరూర్నగర్ డివిజన్ పరిధి విజయవాడ ప్రధాన రహదారి కొత్తపేట చౌరస్తా సమీపంలోని చెన్నై షాపింగ్ మాల్ ముందు మ్యాన్‌హోళ్లు పొంగి ప్రవహిస్తున్నాయి. సీఎం రోడ్డులోని శ్రీ త్రివేణి పాఠశాల ముందు, శ్రీనివాస కాలనీ ప్రధాన రహదారుల్లో మురుగు నీరు మూసి నదిలా ప్రవహిస్తోంది. జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు. భూగర్భ డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారిందని, మ్యాన్‌హోల్ పొంగి పొర్లుతూ రహదారులు మురుగుమయంగా మారుతున్నాయని ఆయా కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య సముదాయాల ముందు మురుగు నిలిచి దుర్గంధం వస్తోందని, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు మున్సిపల్ అధికారులకు, జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి మురుగు సమస్యలను పరిష్కరించాలని ఆయా కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెత్తశుద్ధి ఏదీ?



బీఎన్‌రెడ్డినగర్ పార్కు వద్ద పేరుకుపోయిన చెత్త

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ సర్కిల్-3లోని బీఎన్‌రెడ్డినగర్‌లో పలు కాలనీలో చెత్త సేకరణ అస్తవ్యస్తంగా తయారవుతోంది. దీంతో పలు కాలనీలు స్వచ్ఛతకు దూరం అవుతున్నాయి. అధికారులు చెత్త సేకరణపై నిర్లక్ష్యధోరణి అవలంభిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారులతోపాటు కాలనీలు, వీధులు, శివారు ప్రాంతాల పరిసరాలను చెత్తమయంగా మారుతున్నాయి. ఇంటింటికీ చెత్త సేకరణకు ఆటోలు ఉన్నా, వీధుల వెంట ఉన్న చెత్తను తొలగించేందుకు వాహనాలు ఉన్నా చెత్త సేకరణ సక్రమంగా జరగడంలేదు. దీంతో పలు ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలు గుట్టలు గుట్టలు పేరుకుపోతున్నాయి. పార్కుల ప్రహరీల వద్ద చెత్తను తొలగించడంలో సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అక్కడ రోజు రోజుకు చెత్త పేరుకపోతుంది. అధికారులు చెత్త సేకరణపై దృష్టి సారించి చిత్తశుద్ధితో రోజు వారీగా చెత్తను శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.